క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మునగాల : మండల కేంద్రం శివారులోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన గణితం సబ్జెక్ట్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13 నుంచి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు గణితంలో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వృద్ధాశ్రమానికి రూ.పదివేల విరాళం


వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో దేవాలయ నిర్మాణ పనులకు చిలుకూరు మండలం మాధవగూడెం గ్రామానికి చెందిన ఉల్లేందుల నరసింహారావు రూ.10 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. అదేవిధంగా ముకుందాపురం గ్రామానికి చెందిన దగ్గుపాటి ఏసు –నాగమణి దంపతుల కుమార్తె కృష్ణవేణి పుట్టినరోజు సందర్భంగా వృద్ధులు, అనాథలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కీర్తన, స్మృతి, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, సిబ్బంది వాచేపల్లి భవ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు కోరారు. బుధవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. స్కావెంజర్లను నియమించాలని అన్నారు. ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

వాగులో రెండుసార్లు పూడిక తీయించాం

నడిగూడెం : మండల కేంద్రంలో సమస్యగా మారిన వాగులో తన హయాంలో రెండుసార్లు పూడిక తీయించానని స్థానిక మాజీ సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానికంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తాను వాగులో పూడిక తీయించి, కంపచెట్లను తొలగించినట్లు తెలిపారు. లక్షల రూపాయల వ్యయంతో పనులు చేపట్టామని, కానీ నేటికి బిల్లులు మంజూరు కాలేదని ఆమె తెలిపారు.

గ్రామ పంచాయతీకి ట్యాంకర్లు, ట్రక్కు అందజేత


ట్యాంకర్, ట్రక్కు అందజేస్తున్న సాగర్ సిమెంట్ యాజమాన్యం

మఠంపల్లి : మఠంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి మండలంలోని సాగర్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం రెండు వాటర్ ట్యాంకర్లు, ఒక ట్రాక్టర్ ట్రక్కును బుధవారం ఎంపీడీఓ మామిడి జానకిరాములు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, కిషోర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కృపానందం, రాములు, మహేష్, వెంకటరెడ్డి, గ్రామపెద్దలు, తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

నేరేడుచర్ల : వ్యవసాయ సీజన్ ప్రారంభం అయినందున మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు రాకుండా అరికట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తాళ్ల నరేందర్‌రెడ్డి కోరారు. బుధవారం నేరేడుచర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సీజన్ కరువు దృష్ట్యా కష్టకాలంలో ఉన్న రైతన్నలు నష్టపోకుండా అధిక దిగుబడులు ఇచ్చే వరి విత్తనాలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకారం రైతు భరోసా పథకం కింద రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని అన్నారు. రైతు కూలీలకు రూ.12వేల చొప్పున అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని మఠంపల్లి బైపాస్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు నిలబెట్టేందుకు గాను పట్టణంలోని రెడ్డి బజార్ అంబేద్కర్ కాలనీ, మఠంపల్లి బైపాస్ రోడ్, లక్కవరం రోడ్డు, అనుముల గూడెం ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట

- విత్తనాలు, పాన్ దుకాణాల్లో అధికారుల ముమ్మర తనిఖీలు
- సరిహద్దు చెక్ పోస్టు వద్ద నిరంతర నిఘా


మఠంపల్లిలోని పాన్‌షాపులో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)


విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

మఠంపల్లి : తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలకు సరిహద్దు అయిన మఠంపల్లి మండలంలో అక్రమ వ్యాపారాలను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. కిష్టపట్టె ప్రాంతంలో పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు విత్తనాలు దుకాణాలు, పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మట్టపల్లిలోని క్రిష్ణానదిపై నిర్మించిన హైలెవల్ వంతెనపై నుంచి అక్రమంగా రాష్ట్రంలోకి విత్తనాలు, గుట్కాలు తరలించకుండా చెక్‌పోస్ట్ వద్ద నిత్యం తనిఖీలు చేస్తున్నారు.

ముమ్మరంగా తనిఖీలు..

అయితే కిష్టపట్టె ప్రాంతంలో గల సారవంతమైన నల్లరేగడి భూముల్లో రైతులు పత్తి, మిర్చి పంటలు విరివిగా సాగు చేస్తుంటారు. దీంతో అక్రమార్కులు ఆంధ్రా నుంచి నకిలీ విత్తనాలు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. గుట్కాలు, పీడీఎస్ బియ్యం, వ్యాపారం కూడా సాగుతుంటోంది. ఇటీవల మట్టపల్లి వద్ద 17 మూగజీవాలు పట్టుబడి నీరు, ఆహారం అందక మృత్యువాత పడిన విషయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో పకడ్బందీగా తనిఖీలు చేస్తున్నారు. ఎలాంటి నకిలీ విత్తనాలు వ్యాపారం జరగకుండా డీలర్లతో అవగాహన సమావేశాలు నిర్వహించడంతో పాటు తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలో గుట్కా వ్యాపారంపై కూడా పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు.

పటిష్ట నిఘా కొనసాగిస్తున్నాం



కిష్టపట్టె ప్రాంతం ఆంధ్రా, తెలంగాణకు సరిహద్దుగా ఉండటంతో ఎలాంటి అక్రమ వ్యాపారాలు జరగకుండా పోలీసు, ఇతర శాఖల సమన్వయంతో పటిష్ట నిఘా కొనసాగిస్తున్నాం. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. మట్టపల్లి చెక్‌పోస్టు వద్ద మరింత నిఘా పెంచాం.

– గజ్జి చరమందరాజు, సీఐ, హుజూర్‌నగర్

మూడు పదవులు.. ముప్పైమంది పోటీ!

- మంత్రి ఆశీస్సుల కోసం రాజధానికి న్యాయవాదుల పరుగులు

కోదాడ : ఉన్నవి మూడు పదవులు. దానికోసం ముప్పైమంది నువ్వా..నేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. కోదాడ నుంచి రాష్ట్ర రాజధాని వరకు పైరవీలు మొదలు పెట్టారు. తమకు ఆ పదవి ఎందుకు ఇవ్వాలో లెక్కలు వేసి చెప్పుకుంటున్నారు. పనిలో పనిగా తమకు ఇవ్వకపోయినా పర్వాలేదు కానీ.. ఫలానా వ్యక్తికి మాత్రం ఇవ్వొద్దని కోరుతున్నారు. పెద్దలు మాత్రం తమ మనస్సులో ఏముందో చెప్పకుండా తమ వద్దకు వచ్చిన వారిని నిరాశ పర్చకుండా చూద్దాం.. అంటూ చెప్పి పంపుతున్నట్లు సమాచారం. కోదాడకు కొత్తగా సబ్‌కోర్టు మంజూరు అయ్యింది. దీనికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవసరం. దీని కోసం రెండు రోజుల క్రితం నోటిఫికేషన్ విడుదల చేశారు. మూడు సంవత్సరాల పాటు ఉండే ఈ పోస్టు కోసం కోదాడ బార్ అసోసియేషన్‌లో, ముఖ్యంగా అధికారి పార్టీకి అనుకూలంగా ఉండే న్యాయవాదులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. అధికార పార్టీ నేతలు సిఫార్సు చేసిన వారికే ఈ పదవి దక్కే అవకాశం ఉండడంతో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వద్దకు వీరు క్యూ కట్టారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి సామాజిక వర్గాల వారీగా లెక్కలు వేసి తమను ఆ పోస్టుకు సిఫార్సు చేయాలని, మంత్రికి తమ పేరు చెప్పాలని విన్నవించుకుంటున్నారు. దీంతో పాటు మరో ఏజీపీ పోస్టు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిలర్ పోస్టు కూడా ఉండడంతో మొదటిది అవకాశం లేకపోతే మిగిలిన రెండు పోస్టులకైనా తమను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతుండడంతో ఎవరికి ఓకే చెప్పాలో.. ఎవరికి నో చెప్పాలో తెలియక పార్టీ పెద్దలు కొంత ఇబ్బందిగా ఫీలవుతున్నట్లు సమాచారం. మూడు రోజులుగా పలువురు న్యాయవాదులు రాజధానిలోనే మాకాం వేసి తమకు అవకాశం కల్పించాలని మంత్రిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీనికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15 వరకే సమయం ఉండడంతో వీటిని ఆశిస్తున్నవారు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రస్తుతం కోదాడలో ఎక్కడ చూసినా ఈ మూడు పదవుల గురించే చర్చ జరుగుతోంది. కాగా ఏజీపీ పోస్టు తనకే వస్తుందని పట్టణానికి చెందిన ఓ న్యాయవాది ప్రచారం చేసుకుంటున్నట్లు తెలిసింది. కానీ కొందరు న్యాయవాదులు మాత్రం ఆ పదవి తమకు ఇవ్వకపోయినా పర్వాలేదు కానీ ఆ న్యాయవాదికి మాత్రం ఇవ్వొద్దని మంత్రికి, ఎమ్మెల్యేకు విన్నవించినట్లు సమాచారం.

డ్రా పద్ధతిలో రైతుల ఎంపిక

- వేంకటేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు వేలంలో 349 మంది పోటీ


వేలంపాటలో పాల్గొనేందుకు క్యూకట్టిన రైతులు


డ్రా తీస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీస్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన 26 ఎకరాల సాగు భూమిని కౌలుకు సాగు చేసేందుకు గాను బుధవారం ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ అధికారులు డ్రా పద్ధతిలో రైతులను ఎంపిక చేశారు. ఈ ఆలయానికి 19 ఎకరాల మెట్ట, 6 ఎకరాల మాగాణి భూమికి వానాకాలానికి 12 బస్తాలు, యాసంగికి 11 బస్తాల చొప్పున ఇచ్చేవిధంగా నిర్ణయించారు. అయితే గ్రామానికి చెందిన 349 మంది రైతులు రూ.500ల డిపాజిట్ చెల్లించి కౌలు వేలం పాటలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. దీంతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ కమిటీ సమక్షంలో డ్రా నిర్వహించారు. డ్రాలో గ్రామానికి చెందిన చల్లా వెంకటయ్య 19 ఎకరాలు, బోనాల సమత 6 ఎకరాల భూమిని కౌలు చేసేందుకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఈఓ వెంకటచలపతి, అర్చకులు కందాళ శ్రీనివాసాచార్యులు, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సౌకర్యం పునరుద్ధరించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గంధం సైదులు

మునగాల : మండల కేంద్రానికి అంబులెన్స్ సౌకర్యం పునరుద్ధరించాలని సామాజిక కార్యకర్త గంధం సైదులు కోరారు. ఈమేరకు మునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ వెంకటరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో అంబులెన్స్ సౌకర్యం ఉండడంతో మునగాల, నడిగూడెం మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేదని, ప్రమాదాలకు గురైన ఎంతో మంది ప్రాణాలు కాపాడడం జరిగిందని కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం అంబులెన్స్‌ను రద్దు చేసి సూర్యాపేటలో ఏర్పాటు చేయడంతో రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారు, వివిధ రోగాలతో ఆసుపత్రులకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సూర్యాపేట నుంచి మునగాల వరకు అంబులెన్స్ వచ్చేసరికి కాలం వృథా అవుతుందని, తక్షణమే మునగాలలో అంబులెన్స్ పునరుద్ధరించాలని సైదులు కోరారు.

రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న కొండా దేవయ్య

మఠంపల్లి : మున్నూరుకాపు కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ కోరారు. మున్నూరు కాపు సంఘం రాజకీయ చైతన్య యాత్రలో భాగంగా బుధవారం మట్టపల్లిలోని శ్రీకృష్ణదేవరాయ మున్నూరు కాపు సంఘం నిత్యాన్నదాన సత్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని రాజకీయ చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులు రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలా నాగేశ్వరరావు, రామిశెట్టి అప్పారావు, శ్రీనివాసరావు, అచ్యుతరావు, కాశయ్య, పి.నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు, ఏ.నాగేశ్వరరావు, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం


బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : పాత చిలుకూరులో ముత్యాలమ్మ, బొడ్రాయి, తదితర విగ్రహాలు ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి, ముత్యాలమ్మ ఆలయాల వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ఫుడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు

మిర్యాలగూడ టౌన్ : ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించేందుకు మున్సిపాలిటీలో ఫుడ్‌సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. బుధవారం స్థానిక చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ ఆజ్మీరా కిరణ్, పర్యావరణ ఇంజనీరు శ్వేతారెడ్డిలతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ మున్సిపాలిటీ పరిధిలో గల హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను నిత్యం తనిఖీ చేస్తుందని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పనులు సజావుగా సాగే విధంగా అకౌంట్ సెక్షన్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు హనుమాన్ ప్రసాద్, ఎంఏ షహబాజ్, సబార్డినేటర్‌గామణికి బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- అదనపు కలెక్టర్ ప్రియాంక


నామవరంలో అడిషనల్ కలెక్టర్ ప్రియాంకకు అడ్మిషన్ ఫాం అందజేస్తున్న విద్యార్థి తల్లి

మోతె : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక కోరారు. బుధవారం మోతె మండలం నామవరం జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బడి ఈడు పిల్లలను చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలల పునఃప్రారంభం కార్యక్రమంలో భాగంగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్లారావు, తహసీల్దారు సంఘమిత్ర, ఎంపీడీఓ హరిసింగ్, విద్యాధికారి గోపాల్‌రావు, ఎంపీటీసీ పున్నమ్మ, ప్రధానోపాధ్యాయుడు బీఎల్ఎస్.చారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఆర్డీఓ శ్రీనివాసులు


పాలకవీడు : జాన్‌పహాడ్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


హుజూర్‌నగర్ : విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఆర్డీఓ, మున్సిపల్ వైస్ చైర్మన్


హుజూర్‌నగర్‌రూరల్ : విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీఓ

హుజూర్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన నూతన విద్యా సంవత్సర ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ సైదా నాయక్‌లతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం ఏ.రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలో సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఫణికుమారి, డీటీ నాగేందర్, ఆర్ఐ షరీఫ్, మెప్మా సీఓ సాయికృష్ణ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌కుమార్, రామతారక, లక్ష్మీకాంత్, సీఆర్‌పీ సైదులు, మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

నడిగూడెం : కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్‌కుమార్ కోరారు. బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా మునగాల మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమామాలిని, ఎంపీపీ యాతాకుల జ్యోతి, జెడ్పీటీసీ బాణాల కవిత, ఏపీఎం రామలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఉదయమ్మ, ప్రధానోపాధ్యాయుడు ఎం.శోభన్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి తోరణాలతో అలంకరణ

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాలల ద్వారాలకు, ఆవరణలో మామిడి తోరణాలు, బెలున్లతో అలంకరించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, వి.రమేష్, ఉపాధ్యాయులు పద్మావతి, సైదులు, రహీద్‌ఖాన్, శౌరీ, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్ రెడ్డి, అన్నపూర్ణ, నరసింహారావు, మాధవి, కళ్యాణి, భవాని, కృష్ణప్రసాద్, రవి, శ్రీనివాస్‌రావు, స్రవంతి, విజయ, భూదేవి, అన్నపూర్ణ, లాల్‌సాహెబ్, స్రవంతి, విజయలక్ష్మి, సరస్వతి, ఫాతిమా, వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంఈఓ భూక్యా సైదానాయక్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని లింగగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీటీసీ వల్లభనేని విజయలక్ష్మీతో కలిసి ఆయన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం పెనుగొండ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సైదాబీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యతోనే సామాజిక అభివృద్ధి జరుగుతుందని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని అమరవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను ఎంపీడీఓ లావణ్యతో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పురుషోత్తం, విజయ్‌కుమార్, సోమశేఖర్, ఏపీఎం స్వరూప, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య అన్నారు. బుధవారం చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, మాజీ సర్పంచ్ కొడారు బాబు, హెచ్‌ఎమ్ కరుణాకర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ రంజాన్‌బీ, ఏపీఎమ్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, సంఘ బంధం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

పాలకవీడు : ప్రభుత్వ పాఠశాలలు బుధవారం నుంచి పునః ప్రారంభం అయ్యాయి. మండలంలోని పాఠశాలల వద్ద విద్యార్థులకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. తొలిరోజు విద్యార్థులు స్వల్పంగా హాజరయ్యారు. జాన్‌పహాడ్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ చత్రునాయక్, ఎంపీపీ భూక్యా గోపాల్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ లక్ష్మిలు విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులు

కోదాడరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు అన్ని వసతులు ఉంటున్నాయని ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి అన్నారు. బుధవారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా కోదాడ మండలంలోని గుడిబండలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేసి మాట్లాడారు. ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఎంఈఓ ఎండీ.సలీంషరీఫ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

మేళ్లచెరువు : ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా మండలంలోని రామాపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజహర్ అలీ, జెడ్పీటీసీ శాగంరెడ్డి పద్మ గోవిందరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగాల మండలంలో..

మునగాల : మండలంలోని పదకొండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఇరవైఏడు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి ఎండీ.సలీమ్‌షరీఫ్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ నుంచి 6,665 పాఠ్య పుస్తకాలు, 13,600 నోటు పుస్తకాలు, ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున 2,260 జతల యూనిఫాం మంజూరైనట్లు పేర్కొన్నారు. తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలకు కూడా యూనిఫాం, పుస్తకాలు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

సిరిపురంలో..

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంపల్లి సతీష్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బి.మల్లీశ్వరి, ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి, ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, మోతీలాల్, ఉమాపతి, ప్రకాష్‌రెడ్డి, అశోక్ గౌడ్, అక్షపతి తదితరులు ఉన్నారు.


నడిగూడెం : బాలుర ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్


మునగాల : కొక్కిరేణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు


కోదాడరూరల్ : పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ కృష్ణకుమారి


హుజూర్‌నగర్‌రూరల్ : యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంఈఓ, ఎంపీటీసీ


మేళ్లచెరువు : విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కొట్టె పద్మ


చిలుకూరు జెడ్పీహెచ్ఎస్‌లో యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు